క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కంచరపాలెం: స్థానిక దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. ప్రత్యేక దర్శనాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నూతన పాలక వర్గానికి అభినందన


శ్రీధర్‌ను సత్కరిస్తున్న సభ్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయ నూతన పాలక వర్గాన్ని శుక్రవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. ఆలయానికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులంతా శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీధర్‌ను కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో తన వంతు భాగస్వామ్యం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సుసర్ల కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతారామరాజునగర్, బాజీ జంక్షన్, చిన్న బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధి, ఎస్సీ కాలనీ, విద్యానగర్, నాయుడు క్వార్టర్స్, రైల్వే స్టేషన్ జంక్షన్ మెయిన్ రోడ్డు, గాంధీనగర్, రెడ్డి వీధి, గవర వీధి, ఇందిరాప్రియదర్శిని నగర్, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం సీ కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

వలంటీర్లను సన్మార్గంలో నడపాలి


మాట్లాడుతున్న ఏయూ ఆర్ట్స్, కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు

మహారాణిపేట : జాతీయ సేవా పథక ప్రొగ్రాం అధికారులు వలంటీర్లను సన్మార్గంలో నడపాలని, సోషల్ మీడియాకు వారు బానిసలు కాకుండా చూడాలని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథక సెమినార్ హాల్లో విజయనగరం, ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రొగ్రాం అధికారుల ఒక రోజు శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దోమలపై దండయాత్ర, స్వీప్, ముఖ్యమైన దినోత్సవాల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించడంలో జాతీయ సేవా పథక వలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. వలంటీర్లు ఓటర్లను జాగృత పరచడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. జాతీయ సేవా పథక ప్రొగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.హరినాథ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత కార్యక్రమాల్లో రక్తదానం, జాతీయ, అంతర్జాతీయ యువజన కార్యక్రమాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయ వలంటీర్లు ముందున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విశాఖ, విజయనగరం జిల్లాల పొగ్రాం అధికారులు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, జి.చంద్రశేఖర్ ప్రసంగించారు.

సంత...ఎన్నాళ్లీ చింత!

- సౌకర్యాలు లేక ఇబ్బందులు
- రోడ్డుపైనే దుకాణాల నిర్వహణ
- పశువుల ఆస్పత్రికి దారి లేని వైనం


బీఆర్టీఎస్ రోడ్డుపై నిర్వహిస్తున్న దుకాణాలు


సుసర్ల కాలనీ వద్ద ఆరుబయట నిర్వహిస్తున్న సంత

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌కు సమీపంలోని గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాలకు ఆనుకొని ఉన్న స్థలంలో నిర్వహిస్తున్న సంతలో సౌకర్యాలు లేక దుకాణదారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ శని, సోమవారం రోజున ఇక్కడ సంత నిర్వహిస్తున్నారు. కూరగాయలు, నిత్యావసర సరకులు, పండ్ల దుకాణాలతో పాటు మాంసాహార షాపులు సైతం ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఎన్ఏడీ సెంటర్‌కు ఇరువైపులా ఉన్న జీవీఎంసీ 52,90,91 వార్డుల పరిధిలోని కాలనీల ప్రజలు సంతకు వచ్చి వారికి అవసరమైన సరకులు కొనుగోలు చేసుకుంటారు. శని, సోమవారం రోజుల్లో సాయంత్రం వేళ ఆ ఏరియా కొనుగోలు దారులతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ దుకాణాల నిర్వహణకు డిమాండ్ ఉంది. స్థలం సరిపోక కొంతమంది బీఆర్టీఎస్ రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆ దారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

సౌకర్యాల కల్పనలో అలసత్వం

పశువుల ఆస్పత్రి వద్ద చాలా కాలంగా సంత నిర్వహిస్తున్నారు. 52వ వార్డుమర్రిపాలెంలో, అదే విధంగా అటువైపు గోపాలపట్నంలో రైతు బజారులు ఉన్నప్పటకీ ఇక్కడ నిర్వహించే సంత సందడిగానే ఉంటుంది. తాజా కూరగాయలు విక్రయిస్తుండడంతో పరిసర కాలనీల వారు కొనుగోలుకు ఎంతో ఆసక్తి చూపుతారు. అయితే సంత నిర్వహణకు అనుమతి ఇచ్చిన జీవీఎంసీ అధికారులు తగిన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంతలో దుకాణదారుల నుంచి జీవీఎంసీలోని కొంత మంది సిబ్బంది, అదే విధంగా వార్డుకు చెందిన టీడీపీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది.


ఆస్పత్రికి వెళ్లే దారిలో ఇలా..

వర్షం వస్తే అంతే సంగతులు

సంతలో దుకాణాల నిర్వహణకు యజమానులు సొంతంగా గుడారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటి కిందే దుకాణాలు నిర్వహిస్తున్నారు. తాగేందుకు నీటి సౌకర్యం కూడా లేదు. అదే విధంగా అక్కడ మరుగుదొడ్లు అందుబాటులో లేవు. సంత నిర్వహించే సమయంలో వర్షం వచ్చిందంటే ఇక అంతే సంగతులు. దుకాణదారులు తమ సామగ్రిని కాపాడుకునేందుకు ఎంతో ప్రయాస పడతారు. కొన్ని సార్లు సరకులు వర్షానికి తడిచి, తీవ్రంగా నష్టపోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా, జీవీఎంసీ అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఆస్పత్రికి దారేదీ?

సంత నిర్వహించే రోజుల్లో సమీపాన ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాలకు దారి లేకుండా దుకాణాలతో మూసేస్తున్నారు. ఆస్పత్రి చుట్టూ దుకాణాలు నిర్వహిస్తుండటంతో పశువులు, పెంపుడు జంతువులను వైద్యం కోసం ఆస్పత్రి లోపలకు తీసుకెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా సంతలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కార మార్గాన్ని చూపాలని దుకాణదారులతో పాటు, కొనుగోలు దారులు కోరుతున్నారు.

గోశాలలో ఘనంగా వన మహోత్సవం


వనమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి


మొక్కలు నాటుతున్న దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శుక్రవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సంపెంగ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం దేవస్థానం అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేవస్థానం గోశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రాజేంద్రకుమార్, నరసింహరాజు, ఏఈ హరిరాజు, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, గాయత్రి పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

నిస్వార్థ సేవ.. దైవ సేవతో సమానం


అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

గాజువాక: నిస్వార్థ సేవలను అందించడమే సత్యసాయి సమితి ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని, అదే దైవ సేవతో సమానమని రాయ్‌పూర్ అమిటీ యూనివర్సిటీ డైరెక్టర్, ఆధ్యాత్మికవేత్త శివమ్ అరుణ్‌కుమార్ పట్నాయక్ అన్నారు. గొంతినవానిపాలెంలోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా లభించదన్నారు. సేవ చేయడం వల్ల ఇబ్బందుల్లో ఉన్న వారు ఆనందంగా ఉంటారన్నారు. మానవులు స్వార్థం విడనాడి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. గొంతినవానిపాలెం భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం మెంటర్ ఆస్పత్రిలో సేవగా 300 మందికి, ప్రతి సోమవారం కోరమాండల్ దరి జీవీఎంసీ ఆస్పత్రి వద్ద 600 మందికి ఆహారం అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ ఎస్.ఆదిరెడ్డి, ప్రతినిధులు రామారావు, జ్యోతి, నరవ శ్రీనివాస్, పద్మరాజు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మొక్కల పెంపకం


గురుకులం ఆవరణలో మొక్క నాటుతున్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులం ఆవరణలో హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చదనం కోసం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. 'స్వచ్ఛ పఖ్వాడా నెల'సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కడ ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఆర్ట్ పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభకనబరిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ రవికాంత్, రీజనల్ చీఫ్ మేనేజర్ సుందర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుశిష్యుల సంబంధాలను బలపర్చుకోవాలి


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

గాజువాక: అధ్యాపక వృత్తిని ఎన్నుకునేవారు గురుశిష్యుల సంబంధాలను బలపర్చుకోవాల్సిన అవసరం ఉందని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మూడు రోజుల ఫ్యాకల్టీ ఓరియేంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిష్యులతో మంచి సంబంధాలను కలిగి ఉంటేనే గురువుల పరంపర కొనసాగుతుందన్నారు. అధ్యాపకులు తమ సిలబస్‌పై ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. రాయలసీమ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ప్రొఫెసర్ వై.నర్సింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వివిధ విద్యా సంస్థల అధిపతులు, అధ్యాపకులు టి.బలరామకృష్ణ, ఎ.వి.ఎల్.జగన్నాథం, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి వెంకయ్యనాయుడు

అక్కిరెడ్డిపాలెం: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం ఉదయం 6 గంటలకు విచ్చేయనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారిని దివ్యక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. వెంకయ్యనాయుడుకు ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు గంద్రేడి నూకరాజు (ఫైల్)

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీకొనడంతో డ్రైవర్ గంద్రేడి నూకరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంద్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

స్టాప్ డయేరియాపై అవగాహన ఉండాలి

మహారాణిపేట: డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించారు. ఇసుకతోట రామాలయం వీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఇంట్లోని ఫ్రిజ్ వెనక ఉండే నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

వివాహిత అదృశ్యం


ఎస్.భవాని

అల్లిపురం: తన భార్య కనిపించడం లేదని అల్లిపురం, గాంధీబొమ్మ జంక్షన్‌కు చెందిన ఎస్.సురేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. గత ఏడాది డిసెంబర్ 24న సురేష్ పనికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా అతని భార్య ఎస్.భవాని కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంది. అప్పటి నుంచి నగరం, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 92941 06386, 9440 904716కు తెలియజేయాలని సీఐ కోరారు.

రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు విక్రయాలు


బియ్యం, కందిపప్పు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు


మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని రైతుబజార్‌లో శుక్రవారం ఉదయం తక్కువ ధరకు బియ్యం,కందిపప్పు విక్రయాలు జరిపారు. ప్రత్యేక స్టాల్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో బియ్యం,కందిపప్పు రేట్లు అధికంగా ఉండడంతో ప్రభుత్వం రైతుబజార్ల ద్వారా తక్కువ ధరలకు వీటిని విక్రయిస్తుందని వివరించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు రామ్మోహన్ నాయుడు,కోరాడ శ్రీను,సర్వసిద్ధి శ్రీలక్ష్మి,పోతబత్తుల శ్రీను,జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి


స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా భాగస్వాములై ఈ ఏడాది విశాఖ నగరానికి మొదటి ర్యాంకునే సాధించేలా కృషి చేయాలని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్, సీజనల్ వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రైడే-ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేసిన నాడు సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్త ఇంటి వద్దనే పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్, ఎస్.ఎస్.జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

శాకంబరిగా వారాహి మాత


శాకంబరి అవతారంలో వారాహి మాత

అల్లిపురం: అల్లిపురంలోని శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడో రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారాహి అమ్మవారిని కాయగూరలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. దీంట్లో భాగంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వారాహి స్తోత్రంతో కీర్తించారు. ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శేషమ్మ

దాబాగార్డెన్స్ : హెల్మెట్‌ధారణ.. హెల్మెట్ ఆవశ్యకతపై శుక్రవారం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా న్యాయ సేవా అథారిటీ నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి శేషమ్మ హెల్మెట్ వాడకం ఆవశ్యకత గురించి తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వారి డ్రైవింగ్ లైసెన్స్ 3 నెలల పాటు రద్దు చేయబడుతుందని తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అన్ని ఆర్టీసీ డిపోల్లో నిర్వహిస్తామని తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ర్యాలీలో పాల్గొన్న శ్రామిక్ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు హాజరై.. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా నాయకత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పట్నాయక్ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పోరాటాల ఫలితంగా పాత పెన్షన్ విధానాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐఆర్ఎఫ్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే 1972లో చేసిన విధంగా సమ్మె చేసేందుకు సిద్ధమన్నారు. ర్యాలీ అనంతరం ప్రధాని మోదీకి రాసిన వినతిపత్రాన్ని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు అందజేసి.. ప్రధానికి పంపాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు పి.వి.జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.